# కాదు సుమా కల!

కిరణ్మయి సారథి




"నా రాజా వస్తాడు. మహదానందం తెస్తాడు" అని మనసు గొంతెత్తి పాడుతూంటే సిగ్గుతో మెలికలు తిరిగిపోతూ ముఖాన్ని చేతుల్లో దాచుకొని బోర్లా పడుకుంది కల్పన.

"వదినా! వదినా!" అంటూ గదిలోకొచ్చిన సుభద్ర కల్పన వాలకం చూసి నవ్వుకుంటూ—

"అన్నయ్య వచ్చేది రేపు. యిప్పట్నుంచే యీ సిగ్గునిలా వేస్ట్ చేయడం బాగా లేదో నా!" అంటూ కల్పన ప్రక్కన చేరింది.

"ఛీ. కొంటెపిల్ల" అని లేచి కూర్చొని చీరను కాళ్ళదాకా సర్దుకొని—

"నీకూ నిద్రపట్టడం లేదుకదూ!" అంది.

"అఫ్‌కోర్స్. అన్నయ్యను చూసి రెండేళ్ళవుతోంది. రేపుఅనేది యీ రోజే అయితే ఎంత బావుంటుందోననిపిస్తోంది. అమ్మా నానగార్లు, తమ్ముళ్ళూ చెల్లాయిలుకూడా నిద్రపోకుండా ఎప్పుడు తెల్లారుతుందా? ఎప్పుడు ఏర్‌పోర్ట్ కెళ్దామా అన్న తొందరలోనే వున్నారు." అని ఆగి కల్పనకేసి చిలిపిగా చూస్తూ—

"యిక మా వదిన సంగతి చెప్పక్కర్లేదనుకో" అంది.

"ఊఁ! చాల్లే" అంది కల్పన బుంగమూతితో.

"సరే నే వెళ్తున్నా వొదినా. అమ్మా నానగార్లతో కబుర్లు చెబుతూ నిద్రవస్తే పోతాను. మరి నువు తీయని కలల్లోకో, తీయతీయని జ్ఞాపకాల్లోకో వెళ్ళిపోవచ్చు. గుడ్‌నైట్" అంటూ వెళ్ళిపోయింది సుభద్ర.

"కొంటెపిల్ల" అనుకొని, తన పడక మీదికి చేరుకొని ప్రక్కనే టీపాయ్ మీదున్న తన భర్త కిశోర్ ఫోటో నందుకొని - ముద్దుపెట్టు

కొని గుండెకు హత్తుకుంది.

"ఏయ్! ఫొటోలోంచికూడా చిలిపితనమేనా?" అని ఫోటోను చేత్తో ఎత్తి పట్టుకొని నవ్వుకుంటూ పెట సర్దుకుంది.

కిశోర్ - రాజేశ్వరి, రాజారావుగార్ల పెద్ద కొడుకు. మెడిసిన్ చదువుతుండగా ఉమెన్స్ కాలేజీలో బియస్సీ చదువుతున్న కల్పనతో పరిచయం కావడం—

"నే నెవరో, నీ వెవరో - నిన్నూ నన్నూ కలిపిందెవరో" అని డ్యూయెట్ పాడుకోవడం, యిరుపక్షాల పెద్దల అంగీకారంతో దంపతులు కావడం జరిగిపోయింది.

"దేవతల్లాంటి అత్తామామలు, మంచి స్నేహితుల్లాంటి నలుగురు ఆడబిడ్డలు, లక్ష్మణుల్లాంటి ఐదుగురు మరుదులు వున్న యీ పవిత్ర దేవాలయంలో పెద్ద కోడలి స్థానం పొందడం ఏ జన్మలో నోచిన ఎన్ని పుణ్యాల ఫలమో" అని తన అదృష్టానికి తాను పొంగిపోతుంటుంది కల్పన.

పై చదువులకోసం అమెరికాకు వెళ్ళాడు కిశోర్. రెండేళ్ళయిపోయాయి. సర్జరీలో ఫెలోషిప్‌తో వస్తున్నాడు. ఆ వస్తున్న వార్తను తెచ్చిన 'కేబుల్'ను మామగారు చూడకుండా ఎన్నిసార్లు హృదయానికి హత్తుకుందో మాటలు వచ్చి వుంటే ఆ కేబులే చెప్పి ఉండేది.

రెండేళ్ళ క్రితం....

కిశోర్, కల్పనల పెళ్ళయి సంవత్సరం దాటిపోయింది. ఆ రోజు రాత్రి పది గంటలు కావస్తోంది.

"అమ్మా కల్పనా! - యీరోజు పేపరిలా యిచ్చెళ్ళమ్మా?" పిలిచారు రాజారావుగారు.

న్యూస్‌పేపర్ తీసుకెళ్ళి ఆయన కందించింది.

"ఏమ్మా! మీ అత్తయ్య నిద్రపోతోందా?" అడిగారు.

"లేదు మామగారూ! భాగవతం ఏంటూ కూర్చున్నారు" అంది.

"మా పెద్దతల్లి సుభద్ర చదువుతోందా!"

"లేదండీ—నేనే" అంది కల్పన తలవంచుకునే.

నవ్వి—"వెళ్ళిరామ్మా! ఆలస్యమైతే యీ భాగవతంకన్నా నిద్రే హాయిగా వుంటుందని నిద్రలో కొరుగుతుంది మీ అత్తయ్య" అన్నారు రాజారావుగారు.

రుక్మిణీ కల్యాణ కథాఘట్టం రాగయుక్తంగా చదువుతోంది కల్పన.

"అంకిలి సెప్పలేదు చతురంగ బలంబుల
తోడ నెల్లియో
పంకజనాభ! నీవు శిశుపాల జరాసుతులన్
జయించి నా
వంకకు వచ్చి రాక్షస వివాహమునన్ భవ
దీయ శౌర్య మే
యుంకువ సేసి కృష్ణ! పురుషోత్తమ!
చేకొని పొమ్ము వచ్చెదన్"

"రుక్మిణీ! రుక్మిణీ!" మేడమీది గదిలోంచి కిశోర్ పిలిచాడు.

పై పంటితో పెదవి నొక్కుకుంటూ నవ్వు రానీకుండా అత్తగారికేసి చూస్తూ కూర్చుంది కల్పన.

"రుక్మిణీ అని వాడు పిలుస్తున్నాడు చూసి రామ్మా" అన్నారు రాజేశ్వరిగారు.

"యీ కథను వింటుంటా రత్తయ్యా" అంది ముసిముసి నవ్వుల్ని దాచుకుంటూ.

అవునేమో అనుకొని "తరువాత చదువమ్మా!" అన్నారు.

"కల్పనా! ఏయ్ కల్పనా! మధ్యాన్నంనుంచీ నా సెట్ కనబడ్డంలేదు. ఎక్కడుందో చూశావా?" మళ్ళీ పైనుంచి కేకలు వినిపించడంతో నవ్వు నాపుకోలేక పద్యం చదవనూలేక ఊరుకుండి పోయింది కల్పన.

గదిలోకి రాజారావుగారొచ్చారు.

"యింకా యిక్కడే వున్నావేమ్మా? వాడేదో వెదుక్కుంటూ దొరకడం లేదని పిలుస్తున్నాడు. వెళ్ళి చూడు" అన్నారు.

"యీ కళ్యాణ ఘట్టం పూర్తికానివ్వండి. ఆలోగా మీరెళ్ళి వాడికి వెతకడంలో సాయపడండి" అన్నారు రాజేశ్వరిగారు రుక్మిణీ కళ్యాణ ఘట్టంలో పూర్తిగా తన్మయులవుతూ.

"సంతోషించాంగానీ - నువ్వెళ్ళమ్మా! మీ అత్తయ్యకు నేను చదివి వినిపిస్తాలే" అన్నారు రాజారావుగారు.

అప్పటిగ్గానీ తన్మయత్వంలోంచి తేరుకో లేదు రాజేశ్వరిగారు.

కల్పనకేసి తిరిగి నవ్వుతూ— "వెళ్ళమ్మా! మీ మామయ్యగారు పద్యాలు పాడితే నిద్ర దానంతటదే వస్తుంది" అన్నారు.

"అంటే బాగా పాడలేననేకదూ" అన్నారు రాజారావుగారు.

"అని నేనన్నానా?" అంటూ నవ్వారు రాజేశ్వరిగారు.

వృద్ధదంపతులు ఒకరిమీద ఒకరు వేసుకునే విసుర్లకు నవ్వుకుంటూ లేచి సిగ్గుపడుతూ మేడ మీది గదిలోకి దారితీసింది కల్పన.

తన భర్త చిలిపితనాన్ని గుర్తుచేసుకుంటూ మొగ్గలు తొడిగిన సిగ్గు పరిమళాలు వెదజల్లే పూవుకాగా, అడుగులో అడుగైనా వడివడిగానే గదిలో కడుగుపెట్టి - కాలుగాలిన పిల్లిలా మెడలో స్టెత్ వేసుకొని తన గుండెను తానే చూసుకుంటూ రుసరుసలాడుతున్న కిశోర్‌ను చూసి - మెల్లగా తలుపు మూసేసి వెనగ్గా వెళ్లి కళ్ళు మూసింది.

చేతుల్ని విసురుగా లాగేసి—

"దేవీగారి పురాణ పఠనం అప్పుడే పూర్త యిందా?" కోపంతో రుసరుసలాడిపోతున్నట్టు అన్నాడు.

"స్టెత్‌కోసం పిలిచారుగా. అది దొరగ్గానే వెళ్ళి పూర్తిచేస్తాను" ఉడికించడానికని వెనక్కి తిరిగింది వెళ్ళబోతున్నట్టుగా.

జడను పట్టుకొని మీదికి లాక్కున్నాడు.

మత్తుగా ఒదిగిపోయింది కల్పన.

"యిదేనా మీ స్టెత్" అంది నవ్వుతూ.

"కాకపోతే యిదా?" అంటూ అందాకా తన మెళ్ళోవున్న స్టెత్‌ను టేబుల్ మీదికి గిరవాటేసి-

"యీ స్టెత్‌తో నా గుండెను పరీక్ష చేసుకుంటున్నాను చూడు" అని కల్పనను తనవైపుకు తిప్పుకొని గట్టిగా హత్తుకున్నాడు.

"అబ్బా! లైటు వెలుగుతోంది" అంది ముద్దుగా.

"ఉండనిద్దూ! అదేం సిగ్గుపడదు" అని పెదవుల్ని అద్దాడు.

కౌగిలిలోంచి పారిపోయి, లైటాఫ్ చేసి, కిశోర్ కౌగిలిలో కరిగిపోయింది కల్పన.

అలా ఎన్నో .... ఎన్నెన్నో .... గడిపిన తీయని పున్నమి రాత్రుల్ని గుర్తుచేసుకుంటూ మగత నిద్రలో కొరిగిపోయింది కల్పన.

* * *

తెల్లారింది.

యిల్లంతా పండగ రోజులా కళకళలాడుతోంది. ఎవరికివారే హడావిడిగా తమతమ పనుల్ని పూర్తి చేసుకుంటున్నారు. తొందరగా తెమలమని ఒకరినొకరు హెచ్చరికలు చేసుకుంటున్నారు.

అందరికంటే ముందుగానే తయారైన రాజారావుగారు రేడియో ముందు కూర్చొని చిన్న కొడుకు అడిగే ప్రశ్నలకు నవ్వుతూ సమాధానాలు చెబుతూ వార్తలు వినడానికి ట్యూన్ చేశారు.

"బొంబాయి నుంచి బయల్దేరిన బోయింగ్ 707 యాంత్రిక లోపంవల్ల బయల్దేరిన కాసేపటికే కూలిపోయిందని తెలియజేయడానికి విచారిస్తున్నాం. పైలట్లతో సహా ప్రయాణీకులందరూ మృతిచెందిన వార్తను తెలపడానికి బాధపడుతున్నాం" అంటూ అందులో మరణించిన ముఖ్యులైనవారి పేర్లు చదువుతూ—

"అమెరికా నుంచి స్వదేశం తిరిగి వస్తున్న డాక్టర్ కిశోర్...."


"బాబూ!" అని గావుకేకవేసి కూలబడిపోయారు రాజారావుగారు.

"నాన్నగారూ" అంటూ కిశోర్ తమ్ముళ్ళు, చెల్లెళ్ళు, "ఏమండీ!" అంటూ రాజేశ్వరి ఒక్కసారిగా అరిచారు.

"అయిపోయిందమ్మా! అంతా అయిపోయింది. మీ అన్నయ్య .... మన కిశోర్ విమాన ప్రమాదంలో...."

"బాబూ! భగవాన్!" అంటూ రాజేశ్వరిగారు వున్నపాటున పడిపోయారు.

"వదినా!" ఏడుస్తూ కేకేసింది సుభద్ర.




ఆ సరికే మేడమెట్ల మీంచి కాలుజారి దొర్లి పడిపోయింది కల్పన.

అప్పటిదాకా సంతోషాన్ని మూటగట్టుకున్న ఆ యిల్లు సర్వస్వం శోకదేవతకు నిలయమయింది.

విషాదం విలయతాండవం చేస్తోంది. ఆ వికృత నాట్యం క్రింద ఆ కుటుంబంలోని హృదయాలు నిర్దాక్షిణ్యంగా నలిగిపోతున్నాయి.

స్పృహ తప్పిన కల్పనకు ఉపచారాలు చేస్తూ కూర్చున్నారు సుభద్ర, మిగతా పిల్లలు.

రాజేశ్వరి, రాజారావుగార్లకు భవిష్యత్తంతా అంధకారంగా కనిపించసాగింది. ఆశలన్నీ నేలరాలాయి.

పచ్చని పందిరి విధి వీచిన ప్రళయ ఝంఝకు నేలమట్టమయింది. పెళ్ళయి మూడేళ్ళయినా దాటని కల్పన బ్రతుకు అడవి గాచిన వెన్నెల కావలసిందేనా?

"భగవాన్! ఎందుకిలా చేశావ్?" అని నుదురు పట్టుకున్నారు రాజారావుగారు.

కల్పన దగ్గరికి చేరి ఒళ్ళోకి తీసుకొని ఏడుపును నిగ్రహించుకుంటూ తల నిమురుతూ, కల్పనకు స్పృహ వచ్చింతరువాత స్థితి నెలా తట్టుకోవాలా అని కుమిలి పోతున్నారు రాజేశ్వరిగారు.

"టెలిగ్రాం" అన్న కేకకు ఒక్కసారిగా అందరూ ఉలిక్కిపడ్డారు.

"కష్టాలుగానీ, నష్టాలుగానీ ఒంటరిగా రావంటారు, యీ టెలిగ్రాం ఎలాంటి సందేశం మోసుకొచ్చిందో" ననుకొని—

"ఏమైనా యింతకంటే పెద్ద నష్టమూ, కడుపుకోతా మాత్రం అయి ఉండదు" అని తనను తాను సర్ది చెప్పుకున్నారు రాజారావుగారు.

కిశోర్ పెద్ద తమ్ముడు కృష్ణప్రసాద్ వెళ్ళి సంతకంచేసి టెలిగ్రామ్ తీసుకొచ్చి రాజారావుగారి కందిచాడు.

రాజారావుగారి చేతులు వణికాయి. తిరిగి తన కొడుక్కిచ్చి-తలపట్టుకొని "నువే చదువ్" అన్నారు.

వణికే చేతులతో టెలిగ్రాం చింపి చదివి-

"డాడీ" గట్టిగా అరిచాడు ప్రసాద్.

"మరో ప్రమాదమై ఉంటుంది, వినడానికి గుండె దిటవు పరచుకోవాల్సి ఉంటుంది" అనుకొని చలనం లేకుండా కూర్చున్నారు రాజా

రావుగారు,

కృష్ణప్రసాద్‌కేసి ఆతృతగా చూస్తున్నా రందరూ!

"డాడీ" మాటలు పెగలడంలేదు, కళ్ళల్లో నీరు సన్నటి పొరలా చదవడానికి అడ్డుతగులు తుండగా తుడుచుకొని నవ్వుతూ,

"డాడీ....డాడీ! యిది అన్నయ్య యిచ్చిన టెలిగ్రాం, ఫ్లయిట్ మిస్సయిందిట, రైల్లో వస్తున్నాను స్టేషన్‌కు రమ్మని యిచ్చాడు. అమ్మా! వదినా! అన్నయ్య....అన్నయ్య విమాన ప్రమాదంలో చిక్కుకోలేదు........" సంతోషంతో మాటలు మరి పెగల్లేదు.

ప్రసాద్ చేతిలోని టెలిగ్రాంను గబుక్కున తీసుకున్నారు రాజారావుగారు.

"మిస్డ్ ది ఫ్లయిట్. కమింగ్ బై ట్రెయిన్ రిసీవ్ అట్ సికింద్రాబాద్ స్టేషన్ టు నైట్-
కిశోర్"

"బాబూ! బాబూ!...." "భగవాన్! ఎంతటి కరుణామూర్తివయ్యా!" అని కళ్ళద్దాలు తీసి కళ్ళు తుడుచుకొని చేతులు జోడించారు రాజారావుగారు.

అందరి కళ్ళల్లోనూ దూకడానికి సిద్ధంగా కన్నీళ్ళు.

అత్యంత విషాదానికీ, అత్యంత సంతోషానికీ—రెండింటికీ వచ్చేవి కన్నీళ్ళే!

నమ్మాలో నమ్మకూడదో ననుకున్నా చేతిలోని టెలిగ్రాం "అబద్ధంకాదు" అని హెచ్చరిస్తుండడంతో అందరి మనసులూ శాంతించాయి. సాయంత్రం ఎప్పుడవుతుందా? అసలు నిజంగా కిశోర్‌ను ప్రాణాలతో చూడగలమా లేదా అన్న సందేహం, ఆదుర్దా అందరిలోనూ తీవ్ర స్థాయిలో కనిపించింది. టెలిగ్రాంరావడం అందరికీ కలలాగే అనిపించసాగింది. ఎవరికి వారే కుదుట పడడానికి ప్రయత్నిస్తున్నారు.

* * *

రాత్రి ఎనిమిది గంటలకల్లా రాజారావుగారి కుటుంబ సభ్యులందరూ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ చేరుకున్నారు. బొంబాయినుంచి రైలు రావడానికి యింకా గంటన్నర టైమున్నా—యింట్లో కాలు నిలవక ఆదుర్దా ఏదో స్టేషన్ లోనే ఎక్స్‌పీరియన్స్ అవుదామనుకొనివచ్చారు.

ముఖాల్లో దైన్యం పూర్తిగా తొలగలేదు.

"తీరా రైలొచ్చేసిన తరువాత అందులో కిశోర్ లేకపోతే—మైగాడ్! వెధవ అనుమానాలన్నీ యిలాంటి సమయాల్లోనే వస్తాయి" అని తనలో తానే తర్జన భర్జనలవుతూ ఆ చివర నుంచి యీ చివరదాకా ప్లాట్‌ఫారమ్మీద తిరుగుతున్నారు రాజారావుగారు.

రాజేశ్వరిగారు, ప్రక్కనే కల్పన, అటు ప్రక్కన సుభద్ర, మిగిలిన చెల్లెళ్ళు, చిన్న తమ్ముళ్ళూ కూర్చున్నారు.

కృష్ణప్రసాద్ మరి యిద్దరు తమ్ముళ్ళు అటూ యిటూ తిరుగుతూ బొంబే ట్రెయిన్ లేట్‌గా వస్తోందా అన్న అనుమానాన్ని నివృత్తి చేసుకోవడానిగ్గానూ మాటిమాటికీ ఎంక్వయిరీ కౌంటర్‌కు వెళ్తున్నారు.

నత్త నడకలా నడుస్తున్న గడియారాన్ని చూస్తూ ఎవరికి వారే తిట్టుకుంటున్నారు.

తొమ్మిది. తొమ్మిదింబావు. అందరి గుండెల్లోనూ రైలు పరుగెడుతోంది. ఆదుర్దాను కప్పి పుచ్చుకుంటున్నారు. ఆదుర్దాను వ్యక్తం చేస్తున్న చెమటను చికాకుపడుతూ తుడుచుకుంటూనే ఉన్నారు.

తొమ్మిదిన్నర! కాసేపట్లో బొంబాయి నుంచి వస్తున్న ట్రెయిన్ ప్లాట్‌ఫారమ్మీదికి రాబోతున్నట్టు ఎనౌన్స్‌చేశారు.

అందరూ లేచి నిలబడ్డారు. దూరంనుంచి రైలుకూత వినిపించింది.

అందరి భవిష్యత్తును, కమ్మని కలలను, అంతకుమించిన కమ్మని నిజాన్ని నిర్ణయించ గలిగిన రైలు.

వచ్చేసింది. అందరి కళ్ళూ రైలుమీదే. కిశోర్‌కోసం పిచ్చిగా, ఆశగా వెదుకుతున్నకళ్ళే.

తలుపు దగ్గర నిలబడి చిరునవ్వులు చిందిస్తూ,

"అమ్మా! నాన్నగారూ! కల్పనా! కృష్ణా! బాబీ" యిలా అందరినీ పేరు పేరునా పిలుస్తుండగా కోలాహలంలో ఆ పిలుపులు గాలిలో కలిసిపోయాయి,

అందరిలోనూ సంతోషం ఒక్కసారిగా

## (వి) చిత్ర విజ్ఞానం



నెదర్‌లాండ్స్, ఇస్రాయిల్, స్విట్జర్‌లాండుల్లో గుడ్డి వాళ్ళకి ఒక చక్కటి సౌకర్యం కలిగించారు. ఆ దేశాల్లోని కరెన్సీ నోట్లమీద చిన్న గుండ్రటి బొడిపె లుంటాయి. వీటిని తాకి లెక్కపెట్టి, కరెన్సీ నోటు విలువ గ్రహించ వచ్చు!

---

పెల్లుబికింది.

ప్రసాద్ ఆ కంపార్టుమెంటు వెంట పరుగెత్తాడు. అనుసరించారందరూ. మళ్ళీ తమ దగ్గర్నుంచి కిశోర్‌ను ఎక్కడ దూరంచేస్తుందో నన్న భయంతో అధిగమించిన సంతోషంతో కంపార్టుమెంట్‌లోంచి కిందికి దిగిన కిశోర్‌ను చుట్టుముట్టారు.

తల్లిదండ్రుల పాదాలకు ప్రణమిల్లాడు. చెల్లాయిల్ని తమ్ముళ్ళను అక్కున చేర్చుకున్నాడు.

అధిగమించిన సంతోషంతో ఏ ఒక్కరికీ నోరు పెగల్లేదు. కళ్ళల్లో సుడులు తిరుగుతున్న నీళ్ళు. ముఖాల్లో ఆనందం. మాట్లాడాలని పెదవులు పడుతున్న యిబ్బంది. మాటల్లో వ్యక్తం చేయలేని అనుభూతి అది.

కిశోర్ - చెమ్మగిల్లిన కళ్ళు తుడుచుకొని నవ్వుతూ....

"ఈ ఉదయం జరిగిన విమాన ప్రమాదాన్ని గురించి పేపర్లోచూసి గుండెపగిలిందేమో ననుకున్నాను. మీ అందరి స్థితి ఊహించుకోలేక తల్లడిల్లిపోయాను. ఆ సరికే నేను రైల్లో వుండడంవల్ల నా సంగతి ఫోన్‌ద్వారానైనా తెలపలేకపోయాను. అయినా నే నదృష్టవంతున్నమ్మా! అవున్నాన్నగారూ!" అన్నాడు రాజారావుగారి గుండెలో ఒదిగిపోతూ.

"అవునుబాబూ! మన మందరమూ ఆదృష్టవంతులమే. అదంతా కల్పన నోచిన నోముల పుణ్యఫలం" అన్నారు రాజేశ్వరిగారు.

"కల్పన. నా కల్పన" అనుకొన్నాడు. కల్పనకోసం వెదికాయి కిశోర్ కళ్ళు.

అందరూ కల్పన కోసం వెనక్కి తిరిగారు.

కిశోర్‌ను చూసిన సంతోషాన్ని తట్టుకోలేక దూరంగా స్తంభాన్నానుకొని, దూకుతున్న కన్నీటి నాపుకోకుండానే పిచ్చి ఆనందంతో అందరినీ; తనివితీరా కిశోర్‌నూ చూసుకుంటోంది కల్పన.

"కల్పనా!" అంటూ కల్పనకేసి పరుగెత్తాడు కిశోర్.

అప్పటి కందరూ తేరుకొని కళ్ళు తుడుచుకోవడంలో మునిగి పోయారు.

కిశోర్ కౌగిలో కల్పన.

"ఏమండీ! మీరు....మీరు" అని మాట్లాడ లేక గుండెలో తలదాచుకొని గట్టిగా ఏడ్చేసింది కల్పన

"పిచ్చి కల్పనా! నాకేమీ కాలేదుగా. నీ నుంచి నన్నెవరూ దూరం చేయలేరు." అని మరింత గట్టిగా గుండెకు హత్తుకున్నాడు కిశోర్.

వేయి దీపావళుల కాంతి ఆ కుటుంబ సభ్యులందరి ముఖాల్లోనూ తాండవించింది.

కిశోర్ కౌగిలిలో గువ్వలా ఒదిగిపోయింది కల్పన.

"మనసున మల్లెల మాలలూగెనే......" దూరంగా ఎక్కడ్నుంచో వస్తున్న పాట విని, తలెత్తి కిశోర్ కళ్ళల్లోకి సూటిగా చూసి, అందరూ తమనే గమనిస్తుండడం గమనించి సిగ్గుపడి కౌగిలిలోంచి విడిపించుకొని దూరంగా జరిగింది కల్పన.

"కాదు సుమా కల" అని నవ్వుకుంటూ అందరూ బయటి క్కదిలారు. □